# డాకూర్‌లో వేగంగా కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ











## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి
# ప్రజావాణి కార్యక్రమం

ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్న అదనపు ఎస్పీ.

ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచనలు – అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్.

**సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి:**

జిల్లా ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఐపీఎస్ తెలిపారు. ఈ రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను ఓపికగా విన్నారు. అనంతరం సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం - మిగతా3లో

## వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై
# అప్రమత్తంగా ఉండాలి




**రాయికోడ్ జులై 27 (ప్రజా జ్యోతి):**

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాల అవకాశాలు పెరిగినందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై చైతన్య కిరణ్ సూచించారు. పలు ప్రాంతాల్లో వర్షాల సమయంలో విద్యుత్ షాక్‌ల వల్ల ప్రమాదాలు చోటుచేసుకున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నియమాలను - మిగతా3లో


# కొండాపూర్
# మండల ఆర్‌డబ్ల్యూఎస్
# అధికారిపై అనుమానాలు ..

పని జరగకుండానే ఎం.బి రికార్డు చేసి బిల్లులు లేపారని ఆరోపణ.

క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా ఎలా ఎం.బి రికార్డ్ చేస్తారు?

**కొండాపూర్ ప్రజా జ్యోతి జులై 26**

కొండాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా, పైప్‌లైన్ మరమ్మతులు, ఇతర ఆర్‌డబ్ల్యూఎస్ (గ్రామీణ నీటి సరఫరా) పనులు పూర్తిస్థాయిలో జరగకుండానే అధికారులు ఎంబీ (మెజర్‌మెంట్ బుక్) నమోదు చేసి కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో అనేక పనులు అసంపూర్తిగా ఉండగా, కొన్ని చోట్ల పనులు ప్రారంభం కాకముందే ఎంబీ నమోదు చేసి ప్రభుత్వ నిధులు విడుదల చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపి, పనుల వాస్తవ పరిస్థితిని పరిశీలించాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. క్షేత్రస్థాయిలో పనులు పూర్తయ్యాయా లేదా అనే విషయాన్ని ఉన్నతాధికారులు తనిఖీ చేసి, అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



# వినూత్న బోధనతో విద్యార్థులకు నాణ్యమైన విద్య





ఉపాధ్యాయుల శిక్షణతో విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్, ప్రధానోపాధ్యాయులు సాంబయ్య,

**వెల్దుర్తి, (ప్రజాజ్యోతి)జూలై 27:** 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన 'తొలిమెట్టు' వృత్త్యంతర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం సోమవారం మండల స్థాయిలో ఘనంగా ప్రారంభమైంది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల బోధనా నైపుణ్యాలను మరింత మెరుగుపరిచే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బుచ్చయ్య నాయక్, వెల్దుర్తి స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సాంబయ్య, మాట్లాడుతూ, నూతన విద్యా విధానానికి అనుగుణంగా విద్యార్థుల్లో అభ్యాస సామర్థ్యాలను పెంపొందించేలా వినూత్న బోధన పద్ధతులను ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని వివరించారు. ప్రత్యేకంగా ఈ విద్యా సంవత్సరంలో ప్రతిరోజూ ఒక గంటపాటు వినూత్న బోధన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఎంఈఓ సూచించారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు ఆధునిక బోధనా విధానాలపై అవగాహన పెంపొందించుకుని, వాటిని తరగతి గదిలో సమర్థవంతంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. మండల స్థాయిలో రెండు దశల్లో నిర్వహించే ఈ శిక్షణ అనంతరం పాఠశాలల్లో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేసేలా ఉపాధ్యాయులకు ప్రత్యేక మార్గదర్శకత్వం అందించనున్నారు. ఈ శిక్షణ కార్యక్రమానికి మండల రిసోర్స్ పర్సన్స్‌గా నవీన్ కుమార్, చంద్రశేఖర్, చిరంజీవి, వసంత్ వ్యవహరిస్తున్నారు.

# ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యం

## జిన్నారంలో ఎస్ఐఆర్ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలలు



**జిన్నారం(ప్రజాజ్యోతి)** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటు హక్కే మూలస్తంభమని, ప్రతి అర్హత కలిగిన పౌరుడు తన ఓటును తప్పనిసరిగా ధ్రువీకరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మున్సిపల్ కేంద్రంలో సోమవారం విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పటాన్‌చెరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ నాయకుల ఆదేశాల మేరకు జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని 36, 37, 38 బూత్‌లలో బూత్ లెవల్ ఏజెంట్ (బీఎల్ఏ) యనగండ్ల నరేందర్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులతో (బీఎల్ఓలు) కలిసి ఎస్ఐఆర్ దరఖాస్తు ఫారాలను నింపించారు. ఈ సందర్భంగా నరేందర్ గౌడ్ మాట్లాడుతూ, ఓటరు జాబితాలో పేరు నమోదు కాని వారు, వివరాల్లో మార్పులు అవసరమైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించుకుని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ఓటు హక్కు కేవలం వ్యక్తిగత హక్కు మాత్రమే కాకుండా సమాజం పట్ల ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని పేర్కొన్నారు. బీఎల్ఓ అధికారులు ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, అవసరమైన పత్రాలను పరిశీలించి దరఖాస్తులను స్వీకరించారు. బూత్ పరిధిలోని ఓటర్లు కూడా ఉత్సాహంగా పాల్గొని తమ వివరాలను ధ్రువీకరించుకున్నారు. ప్రతి అర్హత కలిగిన ఓటరు జాబితాలో పేరు ఉండేలా ప్రజలు సహకరించాలని, ఎన్నికల సంఘం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎల్ఓ అధికారులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, స్థానిక నాయకులు, ఓటర్లు పాల్గొన్నారు.

## కంప్యూటర్ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రభుత్వ పాఠశాలలోని ప్రతి విద్యార్థికి కంప్యూటర్ పై అవగాహన తప్పనిసరి. ఎంఈఓ. బి.సురేష్



**కల్హేర్,27.జూలై.ప్రజా జ్యోతి** సంగారెడ్డి జిల్లా లోని కల్హేర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాధికారి (ఎంఈఓ) సురేష్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి పాఠశాలలో కంప్యూటర్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆధునిక విద్యా విధానాలకు అనుగుణంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) ఆధారిత బోధనా పద్ధతులను అమలు చేయాలని కోరారు. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి బోధనను మరింత ప్రభావవంతంగా మార్చాలని ఆయన అన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొని, బోధనా నైపుణ్యాల అభివృద్ధికి అవసరమైన అంశాలపై అవగాహన పొందారు

## భూగర్భ జలాలను కాపాడండి..

## రైతులకు అధికారుల అలర్ట్

నీరు ఉంటేనే పంట.. జలసిరిపై గ్రామస్థులకు కీలక అవగాహన



**తూప్రాన్ (ప్రజాజ్యోతి) జూలై 27:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విబిజి రాంజీ పథకంలో భాగంగా మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 'జలసిరి'పై అవగాహన గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ ఏపీవో సంతోష్ రెడ్డి మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నీటి సంరక్షణే రైతుకు రక్షణ అని పేర్కొన్నారు. ప్రతి రైతు పంట కుంటలు, బోర్ రీఛార్జ్ పిట్స్, పర్కొలేషన్ ట్యాంకులు, ఇంకుడు గుంతలు నిర్మించుకొని భూగర్భ జలాలను పెంపొందించే చర్యల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. నీటిని వృథా కాకుండా నిల్వ చేసుకుంటేనే భవిష్యత్‌లో సాగుకు ఇబ్బందులు తలెత్తవని, ఇప్పుడే చర్యలు తీసుకుంటేనే రేపటి నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవచ్చు అని గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆంజనేయులు గౌడ్, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ మీనా, పంచాయతీ కార్యదర్శి మహేశ్వరి, పాలకవర్గ సభ్యులు, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## విత్తన మేళా ,,

తక్కువ నీటి ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం





**శివ్వంపేట ప్రజాజ్యోతి జూలై 27:** రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుండి 29 వ తేదీ వరకు శివ్వంపేట మండలం దొంతి రైతు వేదికల్లో విత్తన మేళా నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఎల్-నినో ప్రభావం కారణంగా వర్షపాతంలో లోటు ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. ఈ నేపథ్యంలో తక్కువ నీటితో సాగు చేయగల లిప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడం, ఈ విత్తన మేళా యొక్క ముఖ్య ఉద్దేశం అని అధికారులు అన్నారు, ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ లి"తక్కువ నీరు – ఎక్కువ లాభం"లిఅనే నినాదంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని సూచించారు. రైతులు సాంప్రదాయ వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకుంటే వర్షాభావ పరిస్థితుల్లోనూ నష్టపోకుండా ఆర్థికంగా లాభపడవచ్చని తెలిపారు. మేళాలో అందుబాటులో ఉండే నాణ్యమైన విత్తనాలు, కంది, ఆముదం, మొక్కజొన్న, బెండ, బీర, ఆకుకూర విత్తనాలు, ఈ కార్యక్రమంలో రైతులు, ఏ ఈ ఓ లు పాల్గొన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్న జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి



**హత్నూర 27 జులై (ప్రజాజ్యోతి)** సమీపంలోని పురాతన దత్తయ్య గుట్టలో వెలసిన దత్తాత్రేయ స్వామి క్షేత్రాన్ని తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి యు డబ్ల్యు జె- ఐ జె యు) సంగారెడ్డి జిల్లా శాఖ అధ్యక్షుడు బండారు యాదగిరి సోమవారం సందర్శించారు.దత్తాత్రేయ స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ సభాపతి శర్మ ఆధ్వర్యంలో పూజారులు చంద్రప్రకాష్ శర్మ, సూర్య ప్రకాష్ శర్మ అర్చన జరిపారు.స్వామివారి తీర్థ ప్రసాదాలను అందించారు.ఆలయ మర్యాదలతో వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరిని సత్కరించారు.ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ ఈ దత్తాత్రేయ క్షేత్రానికి 650 సంవత్సరాల చరిత్ర ఉన్నదని అన్నారు.ఈ క్షేత్రంలో ఏటా గురు పౌర్ణమి పురస్క రించుకొని మూడు రోజులపాటు పెద్ద ఎత్తున బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. అందుకని స్వామివారిని దర్శించుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర రాజధాని హైదరాబాదు తో పాటు పరిసర జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు ఈ క్షేత్రానికి వస్తారు.ఈసారి కూడా సోమవారం ఉదయం ఈ బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గణపతి పూజ, చండీ హోమం, ద్వీప ప్రజ్వలన జరిపారు. దత్తాత్రేయునికి అభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గురు పౌర్ణమిని పురస్కరించుకొని తెల్లవారుజాము నుంచే ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ సభాపతి శర్మ తెలిపారు. వేలాదిగా తరలి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ఉమ్మడి మెదక్ జిల్లా టి యు డబ్ల్యు జే (ఐ జేయు) మాజీ ప్రధాన కార్యదర్శి పానుగంటి కృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు శివన్న జైన్ వెన్న చక్రేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# వాగులపై అక్రమ నిర్మాణాలపై అధికారుల నిర్లక్ష్యం ఎందుకు?





**మన్సాన్‌పల్లి బంధం వాగు, పెద్ద వాగు అనుమతుల్లేని అక్రమ వంతెన..**

**రైతుల పంట పొలాలకు ముప్పు అంటూ రైతుల ఆందోళన..**

**వాగులపై అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్..**


ప్రజాజ్యోతి
11 Jul 2026 - Page 3
బంధం వాగు పై అనుమతులు లేకుండానే బ్రిడ్జ్ నిర్మాణం పనులు.

**కొండాపూర్ ప్రజా జ్యోతి జూలై 27:** కొండాపూర్ మండలం మన్సాన్‌పల్లి గ్రామ పరిధిలోని బంధం వాగుపై నిర్మిస్తున్న వంతెనపై స్థానిక రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పెద్ద వాగుపై సంబంధిత శాఖల అనుమతులు లేకుండానే వంతెన నిర్మాణం చేపట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించడం లేదని, దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఆరోపణల ప్రకారం, వంతెన నిర్మాణం కారణంగా వాగు సహజ ప్రవాహానికి ఆటంకం ఏర్పడే అవకాశం ఉందని, వర్షాకాలంలో వరద నీరు వెనక్కి మళ్లి పంట పొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు. లక్షల రూపాయల విలువైన పంటలు దెబ్బతినే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.అలాగే, నిర్మాణంలో నాసిరకం సామగ్రి వినియోగిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, నాణ్యతా పరీక్షలు నిర్వహించకుండా పనులు కొనసాగించడం వల్ల భవిష్యత్తులో వంతెన భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారుతుందని స్థానికులు అంటున్నారు. ఈ విషయంపై వెంటనే ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, సాంకేతిక ప్రమాణాలు, నాణ్యత అంశాలపై సమగ్ర విచారణ జరిపి, అక్రమాలు జరిగి ఉంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## కామునిచెరువు., రామేశ్వరం చెరువుల్లోకి వరద నీరు.. రైతుల్లో ఆనందం. చిగురించిన ఆశలు



**కల్హేర్, జూలై 27. ప్రజా జ్యోతి** గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కలిగిరి మండలంలోని ప్రఖ్యాత కాముని చెరువుతో పాటు షాహీ కుంట, మరియం కుంట తదితర చిన్నా, పెద్ద చెరువుల్లోకి వరద నీరు చేరుతోంది. దీంతో స్థానిక రైతులు ఆనందం వ్యక్తం చేస్తూ వర్షదేవుడికి కృతజ్ఞతలు తెలిపారు. ఇదే విధంగా కల్హేర్ మండలం బీబీపేట్ సమీపంలోని రామేశ్వరం చెరువులోకి కూడా వరద నీటి ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. చెరువు ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున వరద నీరు చేరుతుండటంతో చెరువు జలకళను సంతరించుకుంది. చెరువులు నిండితే భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగునీటి సమస్య కొంతవరకు తీరుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రానున్న రోజుల్లో కూడా ఇదే విధంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, వాగులు పూర్తిగా నిండాలని వారు వర్షదేవుడిని ప్రార్థిస్తున్నారు. ఈ వర్షాలతో ఖరీఫ్ సాగుకు అవసరమైన నీటి లభ్యత మెరుగుపడే అవకాశముందని రైతులు పేర్కొంటున్నారు. చెరువుల్లోకి నీరు చేరుతుండటంతో మండలంలోని రైతాంగంలో కొత్త ఆశలు చిగురించాయి.

## సాధుల్ నగర్ గ్రామంలో సమగ్ర ఓటర్ నమోదు గ్రామ సభ



**హత్నూర 27జులై (ప్రజాజ్యోతి)** డిప్యూటీ ఎమ్మార్వో నరేందర్ రావు ఆధ్వర్యంలో గ్రామసభ హత్నూర మండల్ సాదుల నగర్ గ్రామంలో సోమవారం నాడు ఒఅతీ సమగ్ర ఓటర్ నమోదు కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా హత్నూర మండల్ డిప్యూటీ ఎమ్మార్వో నరేందర్ రావు మాట్లాడుతూ ఇప్పటివరకు గ్రామంలో పూర్తిస్థాయిలో ఓటర్ నమోదు ప్రక్రియ పూర్తికాలేనం దున సదుల నగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మి కృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించడం జరిగిందని ఆయన తెలిపారు ఈ సందర్భంగా డిప్యూటీ ఎమ్మార్వో నరేంద్రరావు మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటును వినియోగించుకునే అవకాశం నాలుగో తారీఖు లోపు వారి పూర్తి డాటా గ్రామ బి ఎల్ ఓ కు తెలుపాలని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి విక్రాంత్ రెడ్డి తో పాటు సదుల్ నగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మి కృష్ణ మాజీ సర్పంచ్ భాస్కర్ గౌడ్ ఉప సర్పంచ్ అశ్విని ప్రసాద్ బి ఎల్ ఓ మంజుల మాజీ గ్రామపంచాయతీ సభ్యులు వసరి గారి వీరేశం గడ్డం రామరాజు తలారి భాస్కర్ బాన్సువాడ శ్రీకాంత్ గౌడ్ మంజుల సుజాత గ్రామపంచాయతీ సభ్యులు నాగరాజు శేఖర్ గ్రామ పెద్దలు యువకులు పాల్గొన్నారు

# రేపు కల్హేర్‌లో 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్. వ్యవసాయ అధికారి వెంకటేశం.

## ముఖ్య అతిథి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**కల్హేర్. 27.జూలై. ప్రజా జ్యోతి** కల్హేర్ మండల రైతు వేదికలో మంగళవారం (జూలై 28) ఉదయం 9.30 గంటలకు 'రైతు నేస్తం' 100వ ఎపిసోడ్ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, ఐఏఎస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కల్హేర్ మండలంలోని ప్రజా ప్రతినిధులు రైతు సోదరులు రైతు వక్తలు. అధికారులు ఉన్నత అధికారులు ప్రింట్ మీడియా ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై విస్తృత ప్రచారం కల్పించాలని మండల వ్యవసాయ అధికారి వెంకటేశం కోరారు. కార్యక్రమం రైతు వేదిక, కల్హేర్‌లో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.



## ప్రజల సమస్యల సత్వర పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం.

-మొదటిపేజీ తరువాయి

అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ, స్థానిక పోలీస్ స్టేషన్లలో తమ సమస్యలకు పరిష్కారం లభించని పక్షంలో ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి ఫిర్యాదుపై జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రజలకు త్వరితగతిన, పారదర్శకంగా న్యాయం అందించడమే సంగారెడ్డి జిల్లా పోలీస్ శాఖ లక్ష్యమని అదనపు ఎస్పీ తెలియజేశారు.

## డాకూర్‌లో వేగంగా కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

**అందోల్, జూలై 27, (ప్రజాజ్యోతి):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా డాకూర్ గ్రామంలో బీఎల్‌ఓలు, అధికారులు సమన్వయంతో ఇంటింటి సర్వేను వేగవంతంగా నిర్వహిస్తున్నారు. అర్హులైన ప్రతి ఓటరును గుర్తించడం, వివరాలను ధృవీకరించడం, అవసరమైన మార్పులు, చేర్పులు నమోదు చేయడం వంటి పనులను క్షేత్రస్థాయిలో చేపడుతున్నారు. ఈ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న బీఎల్‌ఓలు పుష్పమ్మ, అరుణ, ప్రమీల, లక్ష్మి, అధికారులు ఖలీల్, జీపీఓ ప్రసాద్ గ్రామ ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కార్యక్రమం సమర్థవంతంగా జరిగేలా గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యుడు గంగనోల్ల గోపాల్ అధికారులకు సహకారం అందించారు. ప్రజలు కూడా అధికారులతో కలిసి సహకరిస్తూ అవసరమైన వివరాలను అందజేయడంతో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది.

## వర్షాకాలంలో విద్యుత్ భద్రతపై అప్రమత్తంగా ఉండాలి: ఎస్సై చైతన్య కిరణ్

-మొదటిపేజీ తరువాయి

తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు. ఎస్సై తెలిపిన సూచనల ప్రకారం తెగిపోయిన లేదా కిందపడిన విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లకూడదని,విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు,జంక్షన్ బాక్సుల వద్ద నీరు నిల్వ ఉంటే వాటికి దూరంగా ఉండాలని సూచించారు.తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు లేదా ఎలక్ట్రికల్ పరికరాలను తాకరాదని,పిల్లలను విద్యుత్ స్తంభాలు,తీగలు,ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉంచాలని పేర్కొన్నారు. అలాగే ఇంట్లో వైరింగ్,ఎర్తింగ్ సరిగా ఉందో లేదో పరిశీలించి,లోపాలు ఉంటే అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్‌తోనే మరమ్మతులు చేయించాలని సూచించారు.చెట్లు విద్యుత్ తీగలపై పడినా లేదా తీగలు వాలినట్లు కనిపించినా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం అందించాలని తెలిపారు.వర్షం,ఉరుములు,మెరుపుల సమయంలో విద్యుత్ స్తంభాలు లేదా చెట్ల కింద నిలబడవద్దని హెచ్చరించారు.ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే నేరుగా తాకకుండా ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేసి,వెంటనే 108 అత్యవసర సేవలకు లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. "ప్రజల ప్రాణ భద్రతే మా ప్రాధాన్యం.వర్షాకాలంలో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చు.ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నియమాలను పాటించి,ప్రమాదాలను నివారించేందుకు పోలీసు,విద్యుత్ శాఖ అధికారులతో సహకరించాలి"అని విజ్ఞప్తి చేశారు.

## జలసిరి కార్యక్రమంలో భాగంగా గంగారం గ్రామంలో రెండు ఫార్మ్ పాండ్ పనులకు ఘన ప్రారంభం.



**కొండాపూర్ ప్రజా జ్యోతి** జలసిరి కార్యక్రమంలో భాగంగా కొండాపూర్ మండలంలోని గంగారం గ్రామంలో రెండు ఫార్మ్ పాండ్ నిర్మాణ పనులను ఎంపీడీవో సౌమ్యశ్రీ చేతుల మీదుగా ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, రైతులకు సాగునీటి లభ్యతను మెరుగుపరచడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం లక్ష్యంగా జలసిరి కార్యక్రమం కింద ఫార్మ్ పాండ్‌లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే రైతులకు నీటి కొరత సమస్య తగ్గి, వ్యవసాయానికి ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని స్వాగతిస్తూ, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అధికారులు పనులను నాణ్యతా ప్రమాణా లతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సరిత అశోక్, ఏపీ ఓ వీరప్ప,పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ ప్రభా కర్, ఫీల్డ్ ఆఫీసర్ రవి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీ మరోసారి నెరవేర్చిన దోసపల్లి సర్పంచ్ బిరదర్ దత్తు



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 27: మనూర్ మండలంలోని దోసపల్లి గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బిరదర్ దత్తు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తూ మరో హామీని నెరవేర్చారు. సోమవారం దోసపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో 2025--26 విద్యా సంవత్సరంలో జెడ్‌పీహెచ్‌ఎస్ మనూర్ పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన దోసపల్లి గ్రామ విద్యార్థులను ఘనంగా సత్కరించారి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. గ్రామానికి చెందిన బిరదర్ అపర్ణకు ప్రథమ బహుమతిగా రూ.5,100, బిరదర్ శ్రీనిజకు ద్వితీయ బహుమతిగా రూ.2,500 నగదు బహుమతులను అందించారు. అనంతరం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాలు, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిరదర్ దత్తు మాట్లాడుతూ..విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చడంతో పాటు జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యకు ప్రోత్సాహం అందించడం గ్రామాభివృద్ధిలో ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలు, డాక్టర్ అమృత్, గ్రామస్తులు రాజశేఖర్, అశోక్, సత్యనారాయణ, నారాయణ, రాజ్‌కుమార్, రవికుమార్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజుల బకాయిల విడుదలకు బీజేపీ సమరభేరి

### -ఫీజుల బకాయి బీజేపీ లాడాయి పోస్టర్ ఆవిష్కరణ



నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూలై 28: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో నారాయణఖేడ్ పట్టణంలో ఫీజుల బకాయి బీజేపీ లాడాయి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం బీజేపీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు కోణం విఠల్, నారాయణఖేడ్ మండల అధ్యక్షులు సిందోల్ దశరథ్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్ సాయి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకుండా దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపించారు. విద్యార్థుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను నిరసిస్తూ బీజేపీ రాజీలేని పోరాటం కొనసాగిస్తుందని పేర్కొన్నారు. బీజేపీ యువ మోర్చా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు గణేష్ కుండే పిలుపు మేరకు, పెండింగ్ ఫీజుల విడుదల కోసం వచ్చే నెల 17, 18 తేదీలలో ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా మండలాల వారీగా పలు నిరసన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో శంకరంపేట్ మండల అధ్యక్షులు శ్రావణ్, నాయకులు సాగుణాకర్, కృష్ణతో పాటు పార్టీ ముఖ్య నాయకులు,